కర్నూలు | నంద్యాల వార్త

31 ఆగస్టు , 2022 బుధవారం పేజీలు 4

పాణ్యం తహశీల్దార్ నాగమణి సస్పెండ్

పాణ్యం,ఆగస్టు 30,ప్రభాతవార్త

పలు భూవివాదాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న పాణ్యం తహశీల్దార్ నాగమణిని సస్పెండ్ చేస్తూ నంద్యాల జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పాణ్యం మండల తహశీల్దార్‌గా పనిచేస్తున్న నాగమణి గత నెలలో గడివేముల మండలం నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గడివేముల మండలంలో పనిచేస్తున్న సమయంలో అక్కడి ప్రభుత్వ భూములను ముడుపులు తీసుకుని అప్పణంగా ఇతరులకు దారాదత్తం చేసినట్లు బలమైన ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. అంతేకాకుండ ఎన్నోఏళ్లుగా ప్రభుత్వ రికార్డులో పదిలంగా ఉన్న ప్రభుత్వ భూములు, మిగులు భూములు గుర్తించి, లక్షలాది రూపాయలు లంచంగా తీసుకుని పాస్ పుస్తకాలు చేశారనే ఆరోపణలు ఇటీవల ప్రచార మాధ్యమాల్లో శిఖార్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మంజీర్ జిలాని సామూన్ స్పందించి వెంటనే ఆమెను సస్పెండ్ చేశారు. ఈమెకు అధికార పార్టీనేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇలాంటి అవినీతికి తెరలేపినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గడివేముల మండలంలో తహశీల్దార్ కార్యాలయంపై ఏసిబి దాడులు కూడ జరిగాయి. అవినీతిలో మొదటి స్థానంలో రెవెన్యూ శాఖ ఉండడానికి కారణం ఇలాంటి అధికారులే నిదర్శనమని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండ గడివేముల మండలం నుండి పాణ్యంకు బదిలీపై వచ్చి ముందుగా రైతుల వద్ద నుండి ప్రభుత్వ భూములకు పట్టా ఇప్పిస్తానని చెప్పి దాదాపు రూ.20నుండి రూ.30లక్షల వరకు తీసుకున్నట్లు కూడ విమర్శలు వినిపిస్తున్నాయి. గడివేముల మండలంలో సోలార్ ప్రాజెక్టు ఉండడంతో భూములకు విలువ వస్తుందని రైతులను నమ్మించి ప్రభుత్వ భూములను కొనుగోలు చేసేలా రైతులకు మాయమాటలు చెప్పి అధిక మొత్తంలో ముడుపులు తీసుకున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. అంతేకాక గడివేముల మండలానికి చెందిన ఓ పొలం వివాదమై కోర్టు భాదితురాలి పక్షం న్యాయం చెప్పిన అత్యుత్సాహం ప్రదర్శించి రెవెన్యూ.. పోలీస్ భాదితురాలిని అనేక ఇబ్బందులకు గురిచేసినట్లు కూడ ఆరోపణలున్నాయి. అవినీతి చిట్టా శృతిమించిన కారణంగా ప్రజల నుండి ఫిర్యాదులు అధికంగా రావడంతో జిల్లా కలెక్టర్ వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని నాగమణిని సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లాలో రెవెన్యూ వర్గాలు చెవికొరుక్కుంటున్నాయి.

నేను రివర్స్ ఐతే పరిస్థితేంటి?

- సంతకాల విషయంలో ప్రతిపక్ష సర్పంచ్‌ల తీరుపై ఎమ్మెల్యే కాటసాని ఆగ్రహం
- సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు లేఖ రాస్తానని వెల్లడి
- విడిది కోసం విచ్చేసిన అతిథుల్లాగా ప్రజాప్రతినిధుల తీరు

2లో

గురుకులంలో జ్వరాల కలకలం.. 20 మంది విద్యార్థులు అస్వస్థత

జూపాడుబంగ్లా , ఆగస్టు 30, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని అంబేద్కర్ సాంఘీక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు తీవ్ర జ్వరం కలకలరేపుతుంది. జలుబు, తీవ్ర జ్వరం లక్షణాలతో 20 మంది విద్యార్థులు ఓ రూమ్‌లో అస్వస్థతకు గురై నేలపట్టారు. 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు దేవ్‌పాల్, పురుశోత్తం నాయక్, కుమార్, శివ,లోక్‌నాథ్, రాఘవ, కార్తీక్, విజయ్, శివశంకర్, 9 వ తరగతి చదువుతున్న వినోత్, మేఘనాథ్, చిన్న రాజు, రాహుల్, రంగస్వామి నాయక్, 8వ తరగతి చదువుతున్న రాజేష్,జశ్వంత్, పురుశోత్తం, 7 వతరగతి చదువుతున్న భరత్ కుమార్, వరుణ్, విక్రమ్, 5 వతరగతి చదువుతున్న కలీల్‌భాషలు జ్వరం, వాంతులతో సిక్కు రూమ్‌లో మూలుగుతున్నారు.

2లో



జయజయ శుభకర వినాయక..

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి శుభకార్యంకు ముందుగా ఆలపించే వినాయకుడి స్తోత్రం.. ఎందుకంటే శుభకార్యాలు తలపెట్టినప్పుడు ఏలాంటి విఘ్నాలు(ఆటంకాలు) కలుగరాదని ప్రతి ఒక్కరు ఇలా చేసారు..“హిందూ సంప్రదాయంలో ఒక ప్రతిష్టాత్మక, ప్రత్యేక పీఠాన్ని అలంకరించిన దేవుడు లంబోదరుడు... సమస్త భారతదేశ ప్రజలు వైభవంగా జరుపుకునే పర్వదినం వినాయక చవితి పండుగ.. గణాధిపతియైన గణపతి ప్రజల నిత్య జీవితంలో ఒక విడదీయరాని విభాగంగా మారిపోయాడు”.. భాద్రపద మాసంలో శుక్లపక్ష చవితి రోజు విఘ్నేశ్వరుడు జన్మించడం, ఆయనకు ఆ రోజే విఘ్నాధిపత్యాన్ని ప్రసాదించడం జరిగినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి..

గణపతి పుట్టుక జ్యోతిష్య శాస్త్ర అన్వయం:
‘గ’ అంటే బుద్ధి, ‘ణ’ అంటే జ్ఞానం..గణాధిపతి అయిన విఘ్నేశ్వరుడు బుద్ధిని ప్రసాదిస్తే, సిద్ధి కలుగుతుందని పండితుల అభిప్రాయం..

ఇక వినాయకుడి పుట్టు పూర్వోత్తరాలు (వినాయకోత్సత్తి) తెలుసుకుందాం:
పూర్వ కాలంలో గజాసురుడు అనే రాక్షసుడు శివున్ని గురించి ఘోర తపస్సు చేసాడు.. అతని తపసుసకు మెచ్చిన పరమశివుడు ప్రత్యక్షమై నీకేం వరం కావాలో కోరుకో అని చెప్పడంతో “నీవు సతతం నా ఉదరంలో నివసించాలి” అని గజాసురుడు కోరుతాడు..దీంతో అప్పటి నుండి శివుడు గజాసురుడి కడుపులో నివాసం ఏర్పాటు చేసుకుంటాడు..ఇక కైలాసగిరిలో పరమశివుడు లేకపోవడంతో పూజలన్ని నిలిచిపోతాయి..తన భర్త జాడ తెలియడం లేదని పార్వతి ప్రమధాది గణాలతో కలసి విష్ణుమూర్తిని ఆశ్రయించగా విష్ణుమూర్తి సైతం శివుడిని వెదకడానికి బయలు దేరుతారు.. చివరకు గజాసురుడి కడుపులో శివుడు ఉన్నట్లు విష్ణుమూర్తి తెలుసుకుని శివుడిని బయటకు రప్పించేందుకు ఉపాయం ఆలోచిస్తాడు.. ఇందులో భాగంగా శివుని వాహనమైన నందిని అలంకరించి బ్రహ్మతో పాటు విష్ణుమూర్తి, మిగిలిన దేవతలు వేషాలు వేసుకుని గజాసురుడి ముందు అద్భుతంగా నాట్యం చేయడంతో ఆనంద పారవశ్యంలో ఉన్న గజాసురుడు మీకేమి కావాలో కోరుకొండని చెప్పడంతోనే కడుపులో ఉన్న శివుడుని ఇవ్వాలని కోరుకుంటారు..దీంతో ఇచ్చిన మాట తప్పని గజాసురుడు వచ్చిన వారు దేవతలని గ్రహించి ఇక తనకు చావు తప్పదని నిర్ధారించుకుని తన ముఖానికి శాశ్వతత్వాన్ని ప్రసాదించమని దేవతలను కోరుతాడు..నంది తన వాడియైన కొమ్ములతో గజాసురుడి వక్షస్థలాన్ని చీల్చడంతో శివుడు బయటకు వస్తాడు.. దీంతో దేవతలు ఎవరి లోకాలకు వారు వెళ్లగా ఈశ్వరుడు మాత్రం గజాసురుడి తలను పట్టుకుని కైలాసానికి బయలువెళ్తాడు..

వినాయకుడి ఆవిర్భావం:
భర్త కైలాసానికి వస్తున్నట్లు తెలుసుకున్న పార్వతి ఎంతగానో సంతోసించి అభ్యంగ స్నానం చేయడానికి వెళుతూ నలుగుపిండితో ఒక బాలుడి బొమ్మను చేసి ప్రాణం పోసి, ఆ బాలుడిని గుమ్మం వద్ద కావలా ఉంచి స్నానానికి వెళ్లింది..ఆ సమయంలో శివుడు కైలాసానికి చేరుకుని లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా ఆ బాలుడు శివుడిని అడ్డుకున్నాడు..దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగి, శివుడికి కోపం తెప్పించడంతో వెంటనే అడ్డుగా వచ్చిన ఆ బాలుడి తలను ఖండించి లోనికి వెళ్తాడు..పార్వతీదేవి స్నానం చేసి, సర్వాలంకారాలతో శివుడి వద్దకు వచ్చి ముచ్చట్లాడుతుండగా మధ్యలో వాకిట్లో తనను అడ్డగించిన బాలుడిని సంహరించినట్లు తెలుస్తోంది..ఈ విషయం తెలుసుకున్న పార్వతీ రోధించడం మొదలు పెట్టడంతో పార్వతీదేవిని ఓదార్చడానికి తాను తెచ్చిన గజాసురుడి ముఖాన్ని బాలుడి మొండానికి అతికించి ప్రాణం పోస్తాడు.. అంతేకాక ఆదిదంపతులు ఆ బాలుడిని కుమారుడిగా స్వీకరిస్తారు.. భాద్రపద శుక్ల చవితి నాడు వినాయకుడు ఆవిర్భవించాడు.. భాద్రపదం అంటే ఏమిటీ.. భద్రమైన పదం, భాద్రపదం, అనగా శ్రేయస్కరమైన స్థానం,,అదే జీవిత గమ్యమైన మోక్షం..తోజోరూపం. చతుర్థి అంటే చవితి నాలుగు వేదాలు..

గరికతో పూజించటంలో ఆంతర్యం:
వినాయకుడికి గరిక పూజ అంటే ఎంతో ప్రీతి అంటారు..వినాయక చవితి నాడు ప్రతిరోజూ విఘ్నేశ్వర, విగ్రహాల ప్రతిష్టించిన ప్రాంతాల్లో గరికతో స్వామి వారిని పూజిస్తారు..పూజా ద్రవ్యాలలో గరికను కూడా జత చేసి సమర్పిస్తారు.. దీనికి సంబందించి పురాణాల్లో ఇలా ఉంది..పార్వతీ పరమేశ్వర్లు పాచికలాడుతుండగా కైలాసంలో న్యాయనిర్ణేతగా నందీశ్వరుడిని ఎంపిక చేసారు. అయితే ఈ పోటీలో ఈశ్వరుడే గెలిచాడని నంది తీర్పు ఇచ్చాడు. కానీ నిజంగా పార్వతే గెలిచిందని నంది ఆమెకు నిజం చెపుతాడు. ఈశ్వరుడు నాకు ప్రభువు తల్లీ, ఆయనే నాప్రాణమని, అయినా మీరిద్దరు అర్ధనారీశ్వర్లు కదా ఎవరు గెలిచినా ఒక్కటేనని చెప్పాడు. దీంతో కోపోద్రేక్తురాలైన పార్వతీ నందీ నీవు నయం కాని రోగంతో బాధపడతావు అని శపించింది..తనకు జరిగిన ఈ పరిణామాన్నికి నంది బాధపడుతుండగా జాలి పడిన పార్వతీ నా కుమారుడైన గణపతి పుట్టిన రోజున నీకు ఇష్టమైన పదార్థాన్ని అర్పితం చెయ్యి అతని అనుగ్రహంతో నీకు శాపవిమోచనం కలుగుతుందని పెలవిచ్చింది.. దీంతో నంది తనకిష్టమైన గరికను గణపతికి సమర్పించాడు..అతనికి శాపవిముక్తి లభించింది.. ఇది వినాయకుడి పూజలో ఉన్న గరిక ప్రాధాన్యత..అప్పటి నుండి వినాయకుడి పూజలో తప్పకుండా గరిక ఉంటుంది..

మూషిక వాహనం..అంతరార్థం:
మూషికం అంటే ఎలుక..ప్రతి గృహంలో సహజీవనం కొనసాగించే చిన్నపాటి జంతువు.. తినుబండారాలను వాసన బట్టి అది ఆ ప్రదేశానికి చేరుకుంటుంది.. బోనులో చిక్కుకుంటుంది..ఈ విధంగా మనిషి జన్మాంతర వాసనల వల్ల ఈ ప్రాకృతిక జీవితంలో చిక్కుకుని, చెడు మార్గాలు పడతాడు..ఇలాగే మూషికవాహనుడుగా వాసనలను, నికృష్ట కోరికలను అణగద్రొక్కెవాడే వినాయకుడు.. అంతేకాక అహంకారానికి చిహ్నం ఎలుక, అహంకార బుద్ధిమంతుల్ని పతనం చేస్తుంది..బుద్ధిపతి అయిన మహాగణపతి దీనిని మలిచి, జయించి సద్వినియోగం చేస్తాడు..అందుకే వినాయకుడు మూషికావాహనుడయ్యాడు..

వినాయకుడి రూప రహస్యం:
వినాయకుడి రూపాన్ని సాధారణంగా చిత్రికరించవచ్చు.. ఆకులతో..గీతలు, చుక్కలు ఎలా వేస్తే అలా వినాయకుడి ప్రతి రూపాన్ని సులభంగా చిత్రికరణ సాధ్యమవుతుంది..అయితే వినాయకుడి రూపంలో ఉండే ఆకారాల గురించి చర్చించుకుంటే..

పెద్దతల: అంటే పెద్దగా ఆలోచించు అని..చిన్న **కళ్లు:** ఏకాత్రతను సాధించు..పెద్ద చెవులు:- ఎక్కువగా వినాలి..

చిన్ననోరు: తక్కువగా మాట్లాడాలి అని, పొడవైన **తొండం:** దీర్ఘకాల ప్రణాళికలు రచించుకోవాలి,

ఏకదంతం: ఒకే లక్ష్యం కోసం పనిచేయాలి, పెద్ద **బొజ్జా:** ఎక్కువ సామర్థ్యాన్ని చూపించాలని,

అభయహస్తం: అందరికీ స్నేహశీలివై, సహకారం అందించు,

ఉండ్రాళ్లు: సామర్థ్యానికి తగ్గ ఫలితం ఆశించు,

ఆయుధం: సమయస్ఫూర్తితో సమస్యలను ఎదుర్కొవాలని, ఇక

ఎలుక వాహనం: కింది స్థాయి వారితో స్నేహంగా ఉండాలనే ఈ వినాయకుడి ప్రతిరూపం మానవ జీవితాన్ని తెలియ జేస్తుంది..

సామాజిక విభేదాలకు అతీతం ఈ వినాయకక **సంబరం:** జాతీయ భావాన్ని పురికొల్పుతూ సామాజిక విభేదాలకు అతీతంగా హిందువులు జరుపుకునే ఉత్సవాల్లో గణేశ్ చతుర్థి ఎంతో ప్రధానమైన పండుగగా నిలిచింది..జాతి జనులను సమగ్రత వైపు నడిపించిన కీర్తి కేవలం గణేశ్ చతుర్థి ఉత్సవాలకే దక్కుతుంది. భారతదేశంలో ఉన్న హిందువులు అనాధిగా మతపరమైన ఎన్నో పండుగలను ఆచరిస్తున్నా, ఏ పండుగకు లేని విశిష్టత ఈ వినాయక చవితి ఉత్సవాల్లో కనిపిస్తుంది..ముఖ్యంగా అగ్రవర్ణాలు, బడుగు వర్గాల మధ్య అంతరాలను తొగించడంలో కీలక పాత్ర వహిస్తున్నందునే దీన్ని జాతీయ స్థాయిలో భారీ ఉత్సవంగా ఏటా నిర్వహిస్తున్నారు.. ఒకప్పుడు ఇళ్లలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలు నేడు పల్లెసీమల నుంచి నగరాల దాకా చూస్తే వీది..వీదినా, వాడవాడలా కోలాహలం కనిపిస్తుంది..కేవలం కుటుంబ పరమైన పండుగలా కాకుండా, విభిన్న సామాజిక వర్గాలన్నీ కలసికట్టుగా నిర్వహిస్తున్నందున ఈ పండుగ జాతీయతకు చిహ్నంగా, సమగ్రతకు వారధిగా గోచరిస్తుంది.. అందుకే జై.. గణేష్ మహారాజుకి.. జై..గణపతి బొప్పమోరియా..గణపతి బొప్పమోరియా..

రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం..

ఆలూరు/ఆలూరు రూరల్,ఆగస్టు 30,ప్రభాతవార్త : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హులేబీడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మంత్రి జయరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మంత్రి జయరాంకు ఘనస్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ మంజుల,ఏడిఎ సునీతలతో కలిసి మంత్రి గుమ్మనూరు జయరాం రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ రైతన్నల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం నవరత్నాల ద్వార అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి అందచేస్తుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామానికి దాదాపు రూ.13కోట్లు అందించామన్నారు. వర్షాలు సంవృద్ధిగా పడుతున్నాయని పాడిపంటలతో రైతన్నలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ధరల స్థిరీకరణ నిధితో రూ.3వేల కోట్లతో రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వార అన్నదాతలకు సబ్సీడీ కింద విత్తనాలు,ఎరువులు,పురుగు మందులు అందచేస్తున్నామన్నారు. రైతన్నలకు అండగా ఉండేందుకు,భరోసా కల్పించడానికి పంటల సీజన్‌లో నష్టపోయిన రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ అందచేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి,గుమ్మనూరు శ్రీనివాసులు, జడ్‌పిటిసి ఏరూరు శేఖర్,వైస్ ఎంపిపి భర్త శ్రీధర్,బెల్దోన సొసైటీ చైర్మన్ నిరంజన్ ప్రసాద్,కాంట్రాక్టర్ రఘునాథ్‌రెడ్డి,సొసైటీ చైర్మన్ తనయుడు వీరాంజనేయులు,మండల కన్వినర్ వీరేష్,మాజీ జడ్‌పిటిసి రామ్‌భీమ్‌నాయుడు,తుంబళబీడు సర్పంచ్ భర్త మల్లికార్జున,ఏడిఎ సునీత, ఎంపిడిఓ అల్లాబకాష్,ఏఓ వెంకటేశ్వరగౌడ్,సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

నేను రివర్స్ ఐతే పరిస్థితేంటి?

గడివేముల ఆగస్ట్ 30 ప్రభాతవార్త : ఇష్టముంటే పని చేయండి లేకపోతే మానుకోండి అంటూ సచివాలయ సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికల్ని వెల్లడించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, శాఖల పనుల్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గడివేముల మండలాన్ని కుడా పరిధిలో చేర్చినందున పక్కా ఇళ్ల నిర్మాణాలకు ఎటువంటి లోటూ లేదని అన్నారు.చిందుకూరు సర్పంచ్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల విషయంలో సంతకాలు పెట్టకపోవటాన్ని కాటసాని తీవ్రంగా ఖండించారు. సదరు సమస్యపై ఈవోఆర్డీ, నరేగా ఏపీవోతో ప్రస్తావిస్తూ...ప్రజలకు నష్టం జరిగేలా వ్యవహరిస్తే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు.ఈ సమావేశంలో అధికారుల తీరుపై సాక్షాత్తూ జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి వ్యతిరేక గళం వినిపించటం గమనార్హం. ముఖ్యంగా కరిమద్దెల సంక్షేమ కార్యదర్శి నాయకుల్ని, జనాల్ని లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని ఆర్‌బీకే ఛైర్మన్ పుల్లయ్య ఫిర్యాదు చేశారు.పలు శాఖల ప్రగతిపై అధికారులు వివరణ ఇస్తున్న సమయంలో ఒకరిద్దరు మినహా ఏ ప్రజాప్రతినిధి కూడా తమ అవసరాలు, ఆకాంక్షలపై ప్రశ్నించకుండా మూగ జీవాల్లా కూర్చోవటం శోచనీయం. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి ఉద్యోగాలు ఇచ్చింది పని చేయటానికి తప్ప సంతకాలు పెట్టి ఖాళీగా కూర్చోవటానికి కాదని అన్నారు. కొరటమద్ది ఉపాధ్యాయురాల్ని అందరూ నిరాకరిస్తున్నా ఎందుకు మళ్లీ నియమించారని విద్యాధికారి రామకృష్ణుడిని ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానమిస్తూ, త్వరలో ఆమె మరో ఉన్నత పాఠశాలకు బదిలీ అవుతున్నట్లు తెలిపారు. బిలకలగూడూరు గ్రామస్థులు తాము సాగులో ఉన్నా...హక్కులు కల్పించటం లేదంటూ కాటసానికి ఫిర్యాదు చేశారు.ఎంపీపీ నాగమద్దమ్మ, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విజయసింహారెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జ్వరాల కలకలం-20 మంది విద్యార్థులు అస్వస్థత..

(మొదటి పేజీ తరువాయి) అదే విధంగా 6 తరగతి చదువుతున్న అరవింద్, అసూష్, ఆకాష్, ఉమేష్‌చంద్ర, హేమంత్, రామచంద్రుడు, మనోజ్ నాయక్‌లు గజ్జితో బాదపడుతున్నారు. మంగళవారం వాంతులతో బాదపడుతున్న ముగ్గురు విద్యార్థులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. చాలా మంది విద్యార్థులు జ్వరం, వాంతులు, గజ్జి తదితర వ్యాదులతో బాధపడుతున్నటికి ఉపాధ్యాయులు వారికి నామమాత్రపు చికిత్సలు చేయిస్తున్నారని విద్యార్థుల తలిదండ్రులు ఆరోపిస్తున్నారు. జ్వరాలతో బాదపడుతున్న విద్యార్థుల సమాచారం కూతవేటు దూరంలో వున్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారికి తెలుపకపోవడం విచారకరం .ఇప్పటికైనా ఉపాధ్యాయులు స్పందించి విద్యార్థులకు మెరుగైన చికిత్సలు అందించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తే కేసులు

ఆదోనిటౌన్, ఆగస్టు30, ప్రభాతవార్త ; ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించినా, విక్రయించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని సెబ్ సీఐ హరికృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని సిరుగుప్ప రోడ్డులోని డంపింగ్‌యార్డు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా, సెబ్ అధికారులను చూసి కారు వదిలిపోయారన్నారు. అందులో 45 బాక్సులు ఓసీ డీలక్స్ విస్కీ లిక్కర్ లభ్యమయ్యిందన్నారు. కారును స్వాధీనం చేసుకుని, కారు నంబర్ ఆధారంగా హనుమంతప్ప, మల్లాపూర్, కొప్పల్ జిల్లా అని రిజిస్ట్రేషన్ అయ్యి ఉందన్నారు. ప్రాపర్టీని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సెబ్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, పీసీలు శ్రీనివాస్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఎంపిపి మృతి వైకాపా పార్టీకి తీరనిలోటు

– మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు,ఆగస్టు 30,ప్రభాతవార్త : ఆలూరు ఎంపిపి బూర్ల సుభాషిణి హఠాన్మరణం వైకాపా పార్టీకి తీరనిలోటని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం,ఆలూరు వైకాపా ఇంచార్జ్ నారాయణస్వామి,దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాసిక్‌లో సాయంత్రం 8.30గంటలకు ఎంపిపి బూర్ల సుభాషిణి గుండెపోటుతో మృతిచెందడం చాలా భాదాకరమన్నారు. ఎంపిపి సుభాషిణి మంచి నాయకురాలని ఇక లేరు అనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. తుదిశ్వాస వరకు ఆలూరు మండల అభివృద్ధికి,వైకాపా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప నాయకురాలు ఎంపిపి బూర్ల సుభాషిణి అన్నారు. ఆమె లేని లోటు ఎవ్వరు తీర్చలేనిదని ఆమె ఆత్మకు శాంతి కలగాలన్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని మంత్రి జయరాం,వారి సోదరులు తెలియజేశారు.

పత్రికా ప్రకటన

నందికొట్కూరు,ఆగస్టు 30,ప్రభాతవార్త: ఉపకార్య నిర్వాహక సమాచార ఇంజనీరు, సమాచార పౌర సంభంధాల శాఖ కార్యాలయం నకు సంభంధించిన వ్యాన్ ఏహెచ్ఓ 7924 ను వారి సమక్షంలో తేదీ 03.09.2022న ఉదయం 11 గంటలకు వాహానం ఉన్న స్థితిలో యథాతదంగా బహిరంగ వేలం వేయబడును. వేలంలో పాల్గొనదలిచిన వారు ధరావత్తు సొమ్ము రూ.20 వేలు(అక్షరాల ఇరవైవేల రూపాయలు) ముందుగా చెల్లించవలసి ఉంటుంది. సదరు వేలంలో పాట రెగ్గిన వారు దానికి తగు మొత్తంతో కలిసి జి.యస్.టి.ని కలిపి చెల్లించ వలసి ఉంటుంది. సదరు వేలంను ఏ విధమైన నోటీసు లేకుండా పూర్తిగా నిలుపు చేయుటకు గాని తేదీని మార్చుటకు గాని శ్రీయుత ఉపకార్యా నిర్వాహక సమాచార ఇంజనీరు, సమాచార పౌర సంభంధాల శాఖ కర్నూలు వారికి సంపూర్ణ అధికారములు గలవని ఇందు మూలముగా తెలియచేయడమైంది.

వేలం నిర్వహించు స్థలం
ఉపకార్య నిర్వాహక సమాచార ఇంజనీరు వారి కార్యాలయం.
సమాచార పౌర సంభంధాల శాఖ
బి./డి1.11, బి.క్యాంప్.

పట్టణాల్లో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

నంద్యాల విద్య, ఆగస్టు 30, ప్రభాతవార్తః నంద్యాల మున్సిపాలిటి పరిధిలోని అంగన్‌వాడీ పోస్టుల కార్యకర్తల నియామకం కోసం దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు అధికారి టిఆర్ఎం చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుచేసుకునే వారు 01-07-2022 నాటికి 21 సంవత్సరాలు పూర్తి అయి 35 సంవత్సరాల వయస్సులోపు ఉండాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా వివాహితురాలై ఉండాలి. స్థానిక వార్డు నందు నివాసితులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 21 నిండనివారు లేనిచో 18 సంవత్సరాలు నిండినవారిని పరిగణలోకి తీసుకుంటామన్నారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలని పుట్టినతేది, కులధృవీకరణ పత్రం, నివాస స్థలం, వికలాంగులైనచో పిహెచ్ సర్టిఫికెట్, వితంతువు అయినో ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను సెప్టెంబర్ 8లోపల సిడిపిఓ కార్యాలయంలో అందజేయాలని ఎంపికలో రూల్ అఫ్ రిజర్వేషన్ పాటించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఫరూక్‌నగర్, సుంకులమ్మ వీధి, విసి కాలనీ, కన్యకాపరమేశ్వరీనగర్, రోజాకుంట, శారదాస్కూల్, బొంతలవీధి, సరస్వతీనగర్, మాల్‌దారుపేటలో ఈపోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

పాఠశాలను అకస్మిక తనిఖీచేసిన ఎంపీపీ సంజీవరెడ్డి

బండిఆత్మకూరు, ఆగస్టు 30, ప్రభాతవార్తః మండల కేంద్రమైన బండిఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం మండల పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి అకస్మిక తనిఖీచేశారు. పాఠశాలలో మధ్యాహ్నభోజనం కార్యక్రమం జరుగుతుండగా తనిఖీచేయడం జరిగిందన్నారు. నాణ్యమైన భోజనాలు అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నామన్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. ఈపథకం వల్ల సమాజంలో వెనకబడిన వర్గాల వారైన దళితులు, గిరిజనులు, ముఖ్యంగా బాలికలను క్రమంతప్పకుండా పాఠశాలకు రప్పించవచ్చన్నారు. పోషాకాహారాన్ని అందించి విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు.ఈపథకం వల్ల సమాజానికి దూరంగా ఉన్నటువంటి గిరిజనులను నాగరిక సమాజంలో కలుపుకోవచ్చన్నారు. కేంద్ర, రా ష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకాన్ని అందిస్తుందన్నారు. ఈపథకంలో ఎలాంటి అవకతవకలు లేకుండా ఉపాధ్యాయులు తరచు పర్యవేక్షిస్తుండాలి అన్నారు. విదా ర్థులకు నాణ్యమైన అహారాన్ని అందించని పక్షంలో నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేటిబాలలే రేపటి పౌరులన్నారు. చదువుతోపాటు మెను ప్రకారం నాణ్యమైనభోజనాన్ని అందించాలన్నారు. ఈకార్యక్రమ ంలో చెన్నారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్ఎం మాధురి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మట్టి విగ్రహాలను పూజించండి

వెలుగోడు,ఆగస్టు 30,ప్రభాతవార్త: మండల కేంద్రమైన వెలుగోడులో వినాయక చవితి పండుగను పురస్కారించుకొని శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రమాలను యం.పి.పి.లాలం రమేష్ పంపిణి చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, శారద జ్ఞాన సరస్వతి పీఠాధిపతి శ్రీశివ యోగేంద్ర సరస్వతి మాట్లాడుతు కాలుష్య నివారణకు, ఎలాంటి రంగులు లేకుండ మట్టితో విగ్రహాలను పూజించడం వలన ఎలాంటి ఇబ్బందులు ఉండవని వారు తెలిపారు. కార్యక్రమంలో నాగార్జున, రవికుమార్, షంషీర్‌ఆలీ, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు సులేమాన్ పాల్గొన్నారు.

కౌన్సిల్ లో రచ్చ..రచ్చ

– బార్ ఏర్పాటు పై కౌన్సిల్ లో దుమారం
– వైస్ ఛైర్మన్,టిడిపి కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం
– పాత్రికేయులపై అసహనం వ్యక్తం చేసిన ఛైర్మన్
– బైఠాయించి నిరసన తెలిపిన టిడిపి కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు ఆగష్టు 30 ప్రభాతవార్తః సచివాలయాల స్థానంలో బార్ ఏర్పాటు చేయడం పై అధికార విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదంతో కౌన్సిల్ సమావేశం రచ్చ..రచ్చగా మారింది. మంగళవారం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో, మునిసిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం నిర్వహించారు. సాధారణ అజెండా, టేబుల్ అజెండా లోని 18 అంశాల్లో కేవలం 9 అంశం మినహ తక్కిన వన్నీ వాయిదా తీర్మానం చేశారు. ఈసంధర్భంగా 21వ వార్డు టిడిపి కౌన్సిలర్ దయాసాగర్ మాట్లాడుతూ పట్టణంలో 21, 17 వార్డు సచివాలయాల స్థానంలో బార్ ఏర్పాటు చేయడం, మునిసిపల్ మార్కెట్ జకాత్ బకాయిలు చెల్లించాలని టెండర్లు దక్కించుకున్న వారు ఇప్పటికి అగ్రిమెంట్ కూడ లేకుండా జకాత్ వసూలు చేయడం అందుకు అధికారులు సహకరించడంపై సమాదానం ఇవ్వాలని, అంతేకాకుండా అక్రమ జకాత్ వసూళ్లు కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వైస్ ఛైర్మన్ నజీర్ ఆహ్మద్ కలుగ చేసుకోవడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వారిని అదుపు చేసే క్రమంలో కౌన్సిల్ సమావేశానికి హజరైన పాత్రికేయులను బయటలకు వెళ్లాలని, మేము వ్యక్తిగతంగా చర్చించాలని ఛైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఆగ్రహించిన పాత్రికేయులకు క్షమాపణ కోరారు. అంతలో తేరుకున్న అధికార కౌన్సిల్ క్షమాపణ చెప్పడంతో వారు శాంతించారు. అయితే అధికార పార్టీ వ్యవహరిస్తున్న తీరు నిరసిస్తూ టిడిపి కౌన్సిలర్లు దయాసాగర్, రాందాస్ గౌడులు బైఠాయించారు. ఈసమావేశంలో మునిసిపల్ కమిషనర్ కృష్ణ, డిఈ మనోహనర్ రెడ్డి, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, టిపిఓ గోపాలకృష్ణ, శానిటరి ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, అకౌంటెంట్ సురేంద్ర రెడ్డి, మేనేజర్ అంజనేయులు, ఆర్వో లోకేష్, ఆర్ఐలు నరసన్న, మంజునాథ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో సంతజూరు గ్రామసర్పంచ్

బండిఆత్మకూరు, ఆగస్టు 30, ప్రభాతవార్తః మండలంలోని సంతజూటూరు గ్రామంలో గల ఇందిరాకాలనీలో దాదాపు 40 సంవత్సరాల నుండి విద్యుత్ సౌకర్యం అంతరాయంగా ఉండేది. కాలనీలో సుమారు 500మంది జనాభా నివాసం ఉంటున్నారు. అయితే ఇంతవరకు కాలనీకి సదుపాయాలు కల్పించిన దాఖలాలు లేవు. ఏవరు పట్టించుకోలేదు. గ్రామ సర్పంచ్ యలగల రామచంద్రుడు ఈకార్యక్రమాన్ని భూజాన వేసుకొని ఇందిరాకాలనీవాసుల చిరకాల సమస్యకు స్వస్తిచెప్పారు. ఈసందర్భంగా కాలనీలో అభివృద్ధి అనే జరగలేదు. దాదాపు ఈకాలనీలో కూలీపనిచేసుకొని జీవనాధారం చేసేవారున్నారన్నారు. చంటిపిల్లలు, వృద్దులు ఎక్కువగా ఉన్నారన్నారు.

జవాన్‌కు ఘనంగా వీడ్కోలు..!

మద్దికెర,ఆగస్టు 30,ప్రభాతవార్త : మండల పరిధిలోని యడవలి గ్రామానికి చెందిన రంగస్వామి(46) సిఐఎస్ఎఫ్ జవాన్ మృతిచెందడంతో ఆయన అంతిమ సంస్కారాలను రాయచూర్ సిఐఎస్ఎఫ్ బెటాలియన్ ఆద్వర్యంలో నిర్వహించారు. రంగస్వామి సిఐఎస్ఎఫ్ జవాన్‌గా ఢిల్లీమెట్రోలో విధులు నిర్వహిస్తూ పండుగ కోసం సెలవులపై గ్రామానికి వస్తుండగా అనారోగ్యానికి గురై హైదరాబాద్ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో మృతదేహానికి తీసుకొచ్చి మంగళవారం కుటుంబ సభ్యులు,గ్రామస్తులు, 1991-92 పూర్వ విద్యార్థిని,విద్యార్థులు, స్నేహితుల ఆద్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామానికి చెందిన జవాన్ ఆకస్మికంగా మృతిచెందడంతో యడవలిలో విషాద చాయలు అలుముకున్నాయి.

మట్టి విగ్రహాలు పంపిణి

మట్టి విగ్రహాలను పంపిణి చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నంద్యాల హాస్పటల్, ఆగష్టు 30, ప్రభాతవార్త: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణి కార్యక్రమం చేపట్టారు. అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి చంద్రమోహన్, ప్రసాద్, రత్నల అధ్వర్యంలో ఐఎంఎ రాష్ట్ర ప్రసిడెంట్ ఎలెక్టు డా.రవికృష్ణ అధ్వర యంలో ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ పిపిఓ లాంటిని కాకుండా మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఇచ్చి కాలుష్యరహిత సమాజాన్ని చేపట్టడమే లయన్స్‌క్లబ్ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీరామ డిజిటల్, ఎన్‌జిఓ కాలనీ, రాజ్‌టాకీస్, పప్పులబట్టీ, బైపాస్‌రోడ్డు, టిటిడి రోడ్, బైర్మల్ వీధి తదితర ప్రాంతాల్లో 900 పైగా మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణి చేశారు. లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో ప్రతిఏడాది ఈకార్యక్రమాన్ని గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో కాశెట్టి చంద్రశేఖర్, శ్రీకాంత్, సందీప్, యూసుప్, మనోజ్, సాయిరాఘవ, బహుళశ్రీ, రూపశ్రీ, మానస్వీలు తదితరులు పాల్గొన్నారు.

పారుమంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

జూపాడుబంగ్లా , ఆగస్టు 30, ప్రభాతవార్త జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని నంద్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సీలో అన్ని రకాల రికార్డులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా ఫార్మసీ విభాగాన్ని, ల్యాబ్‌ను, డెలివరీ గదిని పరిశీలించారు.ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఓ వైద్యాదికారి డాక్టర్ వెంకటేశ్వర్లుకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్య పెంచాలని, మాతృ శిశు మరణాలు జరుగకుండా

ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మహిళను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

ప్రాథమిక దశలోనే గర్భిణీ మహిళలకు రక్తహీనత లేకండా పౌష్టికాహారం,ఐరన్ అండ్ పోలిక్‌యాసిడ్, క్యాల్షియమ్ మాత్రలు అందేలా చూడాల న్నారు ప్రధానమంత్రి మాతృవందనా కార్యక్ర మంలో గర్భిణీ మహిళలకు ప్రతి నెల 9 వతేదిన అన్ని పరీక్షలు చేసి వైద్యం అంది ంచాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆరోగ్యంగా వున్నపుడే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లును డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆదేశించారు. పిహెచ్‌సీ తనిఖీ సమయంలో ఎంపిహెచ్‌ఈఓలు సుబ్రమణ్యం, గుట్టలయ్య, ఫార్మసిస్టు జయలక్ష్మి, సిబ్బంది వున్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

ఆదోని టౌన్, ఆగస్టు30, ప్రభాతవార్త ; ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. కౌన్సిల్‌హాలులో చైర్‌పర్సన్ బోయశాంత ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు బాలాజీ, రాజేశ్వరిరెడ్డి, సందీప్‌రెడ్డి, అశోక్ మాట్లాడారు. కుళాయి కనెక్షన్‌లు లేకున్నా నీటి పన్ను చెల్లించాలని డిమాండ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతూ తమ వద్దకు వస్తున్నారని, చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్‌లు లేకపోయినా ఉన్నట్లుగా రికార్డుల్లో చూపుతూ నీటి పన్ను చెల్లించాలని నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. వాటిపై పున: సమీక్షించాలని కమిషనర్ కోరారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా కమిషనర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ 1993 నుంచి వాటర్ ట్యాక్స్‌లు పెండింగ్‌లు ఉన్నాయని, వాటిని కట్టించేవిధంగా కౌన్సిలర్లు సహకారం అందించాలని కోరారు. చిన్నపాటి వర్షం వచ్చినా తమ ప్రాంతాల్లో వరదనీరు నడుములోతు వచ్చి చేరుతున్నాయని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతుందని

సభ్యులు ప్రశ్నిస్తున్న దృశ్యం — మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కౌన్సిలర్లు పార్వతి, ఉమామహేశ్వరి, మహేశ్వరి, ఎన్.పి.లక్ష్మిదేవి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పూర్తిస్థాయిలో మురుగుకాలువలు లేకపోవడంతో వల్లనే తమకు ఈ దుస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని, అయినా పరిష్కరించే నాథుడేలేడని ఆరోపించారు. ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు ఖర్చు చేస్తూ అభివృద్ధి పనులను చేస్తున్నామని కమిషనర్ సభ్యులకు సమాధానంగా చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని కమిషనర్ సభ్యులను కోరారు. ఈ సమావేశంలో 42 మంది కౌన్సిలర్లు, కమిషనర్, ఎంఈ నాగభూషణంరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు హరినాథ్, శ్రీనివాసులు, రవి, ఏఎస్ఓ సరస్వతి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

నంద్యాల రూరల్,ఆగష్టు 30, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలయొక్క సమస్యలు పరిస్కరించేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సచివాలయ ఉద్యోగులను నియమించిందని సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిస్కరిందుకు కృషిచేయాలని డిఎల్‌పిఓ రాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని అయ్యలూరు, కొత్తపల్లి, పెద్దకొట్టాల, బిల్లలాపురం గ్రామాలలో ఉన్న సచివాలయాలను అకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు పట్టణాలకు రాకుండా గ్రామాల్లోనే సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. స్పందన ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయ్యలూరు గ్రామంలో చెత్తనుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లో ఏవరైన సిసిరోడ్లపై చెత్త వేస్తే నోటీసులు జారీచేయాలని పంచాయితీ కార్యదర్శులకు అదేశించారు. తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి గ్రీన్‌అంబాసిడర్లకు అందించాలని సూచించారు.

తనిఖీచేస్తున్న డిఎల్‌పిఓ రాంబాబు

వేరుచేసిన తడిచెత్త, పొడిచెత్తను గ్రామంలో ఉన్న చెత్తనుంచి సంపద కేంద్రానికి తరలించాలన్నారు. ఇన్‌చార్జీ ఎంపిడిఓ మహిదర్ ండ్డి, పంచాయితీ కార్యదర్శులు అక్బర్‌వలి, మంజుసారెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థి ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

ఆదోని లీగల్, ఆగస్టు30, ప్రభాతవార్త ; స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళా శాలలో డిగ్రీ మొదటి సం వత్సరం చదువుతున్న విద్యార్థి జి.మహేంద్రనా యుడు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ దైవాదీనంరెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆ విద్యార్థిని అభినందించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థి 3549 పాయింట్లు సాధించి ప్రతిభ కనబరిచాడన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురారిమోహన్, చైర్మన్ సతీష్, పీడీలు ఎర్రిస్వామి, కంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త,ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అవుకు,ఆగస్టు30,ప్రభాతవార్త: అవుకు మండలంలోని మెయిన్ అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్త 1,మిని అంగన్‌వాడీ కార్యకర్త 1 మరియు అంగన్‌వాడీ ఆయాలు 2 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ తెలియజేశారు.వివరాల మేరకు లింగంబోడు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు 1 ఓసీ ఈడబ్ల్యూఎస్,ఇస్రానాయక్ తాండా మిని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు 1 ఎస్సీ,శివవరం అంగన్‌వాడీ ఆయా ఎస్సీ1,రామాపురం రెండవ అంగన్‌వాడీ సెంటర్ 1-ఓసీ ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు బనగానపల్లె పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం నందు దరఖాస్తులను ఇవ్వాలన్నారు.

వినాయకచవితి పండుగలో డిజెలకు అనుమతి లేదు - జిల్లా ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగష్టు 30, ప్రభాతవార్త: వినాయకచవితి పండుగను ప్రజలందరు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మండపాలు ఏర్పాటు చేసుకునేటప్పుడు ఎలక్ట్రిక్ వైర్లతో తగిన జాగ్రత్తలతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే మండపాల వద్ద మైకులు ఉపయోగించుకోవాలని, ప్రతిమండపం వద్ద రాత్రి వేళల్లో ఖచ్చితంగా ముగ్గురు కార్యనిర్వాహకులు ఉండాలన్నారు ప్రతి మండపం వద్ద పోలీస్ పెట్రోలింగ్ ఉంటుందన్నారు. విగ్రహాలు నిమజ్జనం రోజు విధుల్లో ఎదురెదురుగా ఊరేగింపులు చేయరాదన్నారు. ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సమితి సభ్యులు చేసుకోవాలని పోలీస్ వారికి సహకరించాలన్నారు. ఊరేగింపు సమయంలో డిజెలకు అనుమతి లేదన్నారు. పండుగను ప్రశాంతవాతావరణంలో దైవభక్తితో అందరు సంతోషంగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అడి మన్ ఆర్ రమణ, సిఐలు ప్రభాకర్‌రెడ్డి, పులిశేఖర్, రవీంద్ర, మురళీమోహన్‌రావు, ఎస్ఐలు సూర్యమౌలి, పీరయ్య, గణేష్‌మహోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు ఈసందర్భంగా ఎస్పీ మట్టి వినాయక బొమ్మలు ప్రజలకు పంపిణి చేశారు.

జీనియస్ స్కూల్‌లో ముందుస్తు వినాయక చవితి వేడుకలు

జీనియస్ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గోనెగండ్ల ఆగస్టు 30 ప్రభాతవార్త : మండల కేంద్రమైన గోనెగండ్లలోని జీనియస్ స్కూల్ నందు ప్రిన్సిపాల్ ముల్లా జైబ భక్తియ ఆధ్వర్యంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ముందుగా పిల్లలు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలు పెట్టి పూజలు చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ముల్లా జైబ భక్తియ మాట్లాడుతూ మట్టితో చేసిన గణపతి విగ్రహాన్ని పూజించడం వలన కరువు కాటకాలు రాకుండా పంటలు సంమృద్ధిగా పండుతాయని అన్నారు.వినాయక చవితి భారతదేశంలో ఒకటిగా ఉంది.వినాయకుడు పవిత్రతకు,విజయానికి మారు పేరుగా ఉన్నాడు.తల్లిదండ్రులను గౌరవించడంలో వినాయకుడుకు సాటిలేరని తెలిపారు.పిల్లలు కూడా ఆయనలాగా తల్లిదండ్రులను పెద్దలను గౌరవించే లక్షణాన్ని అలవర్చుకోవాలన్ని వారు పిల్లలకు సూచించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికే శిల్పా మహిళా సహకార్

నంద్యాల క్రైం, ఆగష్టు 30, ప్రభాతవార్త: మహిళలు అర్థికంగా అభివృద్ధి చెందడానికి శిల్పా మహిళా సేవా సమితి మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి స్థాపించారని ప్రారంభ దశ నుంచి నేటికి వందల సంఖ్యలో మహిళలకు చేయూత అందిస్తున్నామని మహిళా సహకార చైర్మన్ నాగిని రవిసింగారెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని మార్కెట్‌యార్డు నందు శిల్పామహిళా సంఘం అధ్వర్యంలో 150 మంది మహిళలకు రూ.18.31 లక్షల చెక్కులను అందించడంతో పాటు ముగ్గురు మహిళలకు తోపుడు బండ్లను అందించారు. ఈసందర్భంగా నాగిని రవిసింగారెడ్డి మాట్లాడుతూ మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన శిల్పా మహిళా సహకార్ ద్వారా ఎంతో మంది మహిళకు ఉపాధి దక్కుతుందన్నారు. 20 సంవత్సరాల క్రితం స్థాపించిన శిల్పా మహిళ సహకార్ ప్రాథమిక దశ నుంచి అంచలంచలుగా పెరిగిందన్నారు. సహకార్ నుండి చేయూతను అందుకున్న మహిళలు వ్యాపారాలు చేసుకొని బహుమేలుగా జీవనం కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. ఎలాంటి లాభాపేక్షలేకుండా నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన సహకార్ అన్నారు. అర్థికంగా పుంజుకునేందుకు మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. సమాజ శ్రేయస్సుకోసం తమ కుటుంబం అహర్నిశలు కృషిచేస్తుందన్నారు. కొందరు మహిళలు వ్యాపారం చేసుకుంటామని ఎమ్మెల్యేను అడగగా శిల్పా మహిళా సహకార్ నుంచి తోపుడు బండ్లకు కావాల్సిన రుణాలను సహాయం చేశామని చెప్పారు. మహిళలు అభివృద్ధి చెందడానికి శిల్పా కుటుంబం ఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో శిల్పాసేవా సమితి మేనేజర్ లక్ష్మీనారాయణ, మహిళా సహకార్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీలాలు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆకస్మికతనిఖీ చేసిన కర్నూలు ఆర్‌డిఓ

గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కర్నూలు ఆర్‌డిఓ సి.హరిప్రసాద్‌తో సిఎస్‌డిటి నవీన్,డిటి ప్రవీణ్‌కుమార్,ఆర్ఐ అబ్దుల్‌కలాం

వెల్దుర్తి,ఆగస్టు30,ప్రభాతవార్త : స్థానిక జాతీయ రహదారి ప్రక్కన వెల్దుర్తి,క్రిష్ణగిరి మండలాలకు సంబంధించిన ఎంఎల్ఎస్ పాయింట్‌ను మంగళవారం కర్నూలు ఆర్‌డిఓ సి.హరిప్రసాద్ ఆకస్మికతనిఖీ చేశారు.ఎంఎల్ఎస్ పాయింట్ (సివిల్ సప్లయ్ గోడౌన్) రికార్డులను పరిశీలించారు. వివరాలను సిబ్బంది హరిని అడిగి ఆయన తెలుసుకున్నారు.ప్రతినెల రేషన్‌డీలర్లకు సకాలం లో నిత్యావసరవస్తువులు అందుతున్నాయా అని అడిగారు.అవినీతి అక్రమాలకు తావు లేకుండా సంబంధిత అధికారులు నిఘా ఉంచాలన్నారు. ఆర్‌డిఓ వెంట సిఎస్‌డిటి నవీన్,వెల్దుర్తి డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్,మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్‌కలాం,గోడౌన్ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన జాతీయ క్రీడాదినోత్సవం

నంద్యాల హాస్పటల్, ఆగష్టు 30, ప్రభాతవార్త: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందని గెలుపోటములు స్ఫూర్తిగా తీసుకోవాలని లయన్స్‌క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు.మంగళవారం జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ కెఎస్ఎం పాఠశాలలో ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం అసదుల్లా శివకుమార్, వేణు, ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి రవికుమార్ నిర్వహణలో ఐఎంఎ రాష్ట్ర ప్రసిడెంట్ డా.రవికృష్ణ, లయన్స్‌క్లబ్ నిర్వహకులు చంద్రమోహన్, కూర ప్రసాద్, రత్నలు పాల్గొని ప్రసంగించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని విజేతలు తిరిగి విజేతలుగా నిలవడానికి ఓడిన వారు మరింత పట్టుదలతో సాధన చేసి రానున్న పోటీల్లో విజయాలు సాధించాలని వారు కోరారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు కూడ అదేవిధంగా అధికమించి విజయాలు సాధించాలని అపజయాలకు కుంగిపోరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణి చేశారు. కబడ్డీ పోటీల్లో, వాలిబాల్ పోటీల్లో , ఫుట్‌బాల్, ఖోఖో, క్రికెట్, చదరంగం, అథ్లెటిక్, హైజంపు, షాట్‌పుట్ పోటీలలో గ్రామీణ, పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. వీరందరికి బహుమతులను పంపిణి చేశారు. కార్యక్రమంలో సుబ్బారావు, సందీప్ రఘు, శంకర్, రవికుమార్, సాల్మన్, విశ్వనాద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అధరాభిమానాలే ఉద్యోగికి ప్రశంసలు

- స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన డిఇఓకు ఘనసన్మానం

నంద్యాల విద్య, ఆగష్టు 30, ప్రభాతవార్త: ప్రతి ఉద్యోగికి ప్రదవి విరమణ తప్పదని ప్రజల అధరాభిమానాలు, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారి కోసం సేవచేస్తే వారు ఎంతకాలమైన గుర్తుపెట్టుకుంటారని నంద్యాల జిల్లాలో కొద్దికాలంలో పదవి బాధ్యతలు నిర్వహించిన డిఇఓ బత్తుల సత్యనారాయణమూర్తి అందరి అదరాభిమానాలు చూరగొన్నారని కర్నూలు, నంద్యాల డిఇఓలు రంగారెడ్డి, అనురాధ, సర్వశిక్షయాబియాన్ పిఓ వేణుగోపాల్‌లు కొనియాడారు. మంగళవారం డిఇఓ కార్యాలయంలో పూర్వపు డిఇఓకు ఘన సన్మానం నిర్వహించారు. నంద్యాల జిల్లా ఏర్పడిన తరువాత కొత్తగా విదుల్లో చేరిన సత్యనారాయణమూర్తి విద్యాభివృద్ధికి ఎంతో కృషిచేశారని ఇంకా తన సర్వీసు రెండు సంవత్సరాలు ఉండగానే వివిధ కారణాలతో స్వచ్ఛంద పదవీ విరమణ చేయడం బాధకరమన్నారు. విధుల్లో ముక్కుసూటిగా వ్యవహరిస్తు అందరిని సమన్వయ పరుచుకొని నాలుగు నెలల కాలంలో డిఇఓ అఫీసును తీర్చిదిద్ది జిల్లాలోని 29 మండలాల్లో విద్యాధికారుల సమన్వయ పరచుకుంటూ విద్యాప్రమాణాలు పెంపునకు కృషిచేశారు. తన హయాంలో పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని కొన్ని సంఘటనలు జరగడం బాధకరమని పేరొన్నారు. అఫీసు సిబ్బంది ఆయన సేవలను కొనియాడుతూ మాట్లాడారు. అనంతరం వారికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అఫీసు సిబ్బంది ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నాయి.

భాష్యంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు

ఎమ్మిగనూరు క్రైం ఆగష్టు 30 ప్రభాతవార్త: పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ మాచాని కవిత అధ్వర్యంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముందుగా పిల్లలు తయారు చేసిన మట్టి వినాయక విరగహాలు పెట్టి పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మట్టితో చేసిన గణపతి విగ్రహాన్ని పూజించడం వలన కరువు కాటకాలు రాకుండా పంటలు సంవృద్ధిగా కురుస్తాయని ప్రతీతి. అలాగే మనం మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొవడం వల్ల కాలుష్యాన్ని నివారించి పర్యావరణను కాపాడిన వాళ్లం అవుతామని తెలిపారు. ప్రతి ఒక్కరు వినాయక చవితి వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం పిల్లలకు మట్టి వినాయక విగ్రహాలను ప్రిన్సిపల్ అందచేశారు. ఈకార్యక్రమంలో చాంప్స్ ఇంచార్జ్ అనురాధ, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను అందచేస్తున్న ప్రిన్సిపాల్

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

కర్నూలు జిల్లా పరిషత్, ఆగస్టు 30, ప్రభాతవార్త : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం నేడు వినాయక చవితి పండుగ రోజు అయిన కూడా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయని ఎస్ఈ కె.శివప్రసాద్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగ దారులు సద్వినియోగం చేసుకుని బిల్లుల బకాయిలు చెల్లింలి విద్యుత్తు అంత రాయం లేకుండా కొనసాగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముందుగా జిల్లాలోని విద్యుత్ వినియోగ దారులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

బెస్త కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలి

- గంగపుత్ర రాజ్యాధికార సమాఖ్య అధ్యక్షులు పగడాల కోదండ

కర్నూలుక్రైం,ఆగస్టు30,ప్రభాతవార్త: కర్నూలు బిర్లాగేట్ స్థానిక నగరంలోని బ్రహ్మరెడ్డి ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో బెస్త గంగపుత్ర సంఘం నగర మాజీ అధ్యక్షులు పి.సి.మద్దిలేటి అధ్యక్షతన బెస్తల సమస్యల పై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.సమావేశంలో గంగపుత్ర రాజ్యాధికార సమాఖ్య అధ్యక్షులు పగడాల కోదండ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బెస్త కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని కాని కార్పొరేషన్‌కు చిల్లిగవ్వ విడజల్లలేదని దయనీయ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎదిగిన కులాలకు నిధులు ఇస్తున్న ప్రభుత్వం బెస్త కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా బెస్తలను చిన్నచూపు చూడడం దారుణమని జగన్ ప్రభుత్వం బెస్తల పై ఇదే విధంగా అణిచివేత ధోరణి కొనసాగిస్తే మూల్యం చెల్లించకతప్పదన్నారు.నంద్యాల టీడీపీ బిసి సెల్ అధ్యక్షులు బేస్తలకు కార్పొరేషన్ చైర్మన్,డైరెక్టర్ పదవులను మాత్రమే ఇచ్చి ఇంతవరకు పార్టీ పదవుల్లోకాని,నామినేటెడ్ పదవుల్లో కూడా ఒకేఒక పదవి కూడా కేటాయించకపోవడం మంచిదికాదని బెస్తల పై ప్రభుత్వం వివక్ష చూపడం దారుణమన్నారు.వనమాలి ఆసుపత్రి అధినేత డాక్టర్ బేస్త శ్రీనివాసులు మాట్లాడుతూ బెస్తలకు రావాల్సిన రాజ్యాధికార వాటా కోసం బెస్తలందరూ ఐక్య ఉద్యమాలకు సిద్ధంకావాలన్నారు.అనంతరం బెస్తల సమస్యల పై వివిధ రూపాల్లో ఉద్యమించాలని తీర్మానం చేస్తూ మొదటగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించాలన్నారు.బెస్త కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని,సాంప్రదాయ మత్స్యకారులైన బేస్తలను ఎస్టీలో చేర్చుతూ అసెంబ్లీలో బిల్లుపెట్టి పార్లమెంట్‌కు పంపి పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయ్యేలా బాధ్యత తీసుకోవాలని,బెస్త కులగణన ప్రభుత్వం అధికారికంగా చేపట్టాలని,బెస్తలు మెజార్టీగా ఉన్న గ్రామాలు,5వేల పంచాయతీలు,25అసెంబ్లీ,13పార్లమెంట్ స్థానాలు పార్లమెంట్ చట్టం ద్వారా కేటాయించాలని అలాగే సాంప్రదాయ మత్స్యకారుల పొట్టకొట్టే 217 జీవోను రద్దు చేస్తూ ప్రభుత్వం బహిరంగంగా ప్రకటన చేయాలని,జలవనరుల పై సాంప్రదాయ,మత్స్యకార ఉపకులాలకే హక్కులు కేటాయించాలని తీర్మానించారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ బెస్త సంఘం అధ్యక్షులు పుత్తురు కృష్ణమూర్తి,ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర చైర్మన్ గోవిందస్వామి,వినాయక నిమజ్జన కమిటీ జిల్లా పర్కింగ్ ప్రెసిడెంట్,కాంట్రాక్టర్ వేణు,మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి సుభాష్ చంద్రబోస్,అనంతపురం అధ్యక్షులు పామిడి నారాయణ మూర్తి,న్యాప్ జిల్లా అధ్యక్షులు ఉలిందకొండ శ్రీనివాసులు,మత్స్యకార జేఏసీ అధ్యక్షులు లాయర్ శ్రీనివాసులు,తుగ్గలి మల్లికార్జున,సి బెళగల్ సొసైటీ అధ్యక్షులు వెంకటేష్,న్యాప్ జిల్లా కోఆర్డినేటర్ నాగేశులు,రాంబాబు,జనసేన పార్టీ నాయకులు భాస్కర్,ఆలూరు అధ్యక్షులు గోవిందు,లాయర్ పాలూరు శ్రీనివాసులు,అహో

ఉచిత గోమయ గణపతులు పంపిణీ

ఉచిత గోమయ విగ్రహాలు అందిస్తున్న డాక్టరు

కోవెలకుంట్ల,ఆగస్టు 30,ప్రభాతవార్త : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఉచిత గోమయ గణపతులను డాక్టరు వి.నరేంద్రదేవ్ అందించారు. మంగళవారము కోవెల కుంట్ల పట్టణంలో డాక్టరు వి.నరేంద్రదేవ్ పర్యావరణాన్ని పరిరక్షించడానికి గోవు పేడతో చేసిన తయారు చేసిన వినాయకుడి విగ్రహాలను ఉచితంగా అందించారు.

మండలాన్ని అన్ని విధాల అబివృద్ధి చేస్తాం : ఎంఎల్ఏ

మాట్లాడుతున్న యంయల్ఎ కాటసాని

సంజామల(కోవెలకుంట్ల)ఆగస్టు 30,ప్రభాతవార్త : వైసిపి పాలనలో బనగానుపల్లె నియోజక వర్గంతో సంక్షేమంతో పాటు అన్ని మండలాన్ని సమాన ప్రతిపత్తితో అబివృద్ధి పరు స్తున్నామని అందులో బాగంగా సంజామల మండలానిన్న అబివృద్ధి పుంతలు తొక్కుతుందని యంయల్ఎ కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగలవారము సంజామల స్త్రీశక్తి భవనము నందు మండల సర్వసభ్య సమావేశాము యంపిపి పోచావెంకటరమాదేవి అద్యక్షతన నిర్వహించారు. ఈసమా వేశమునకు యంయల్ఎ కాటసాని హాజరు కావడము జరిగింది.ఇందులో అయా శాఖల పనితీరు అడిగి అయన తెలుసుకున్నారు. ఈసందర్భముగా అయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సుఖంగా ఉన్నారని చెప్పారు. ముఖ్యంగా సంక్షేమానికి పెద్ద పీఠ వేశామని చెప్పారు.అలాగే అబివృద్ధి కుడా సమపాల్లో జరుగుతుందని చెప్పారు. నాడు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారము ముఖ్యమంత్రి అన్ని చేశారని చెప్పారు. హామీ ఇవ్వని వాటిని కూడా అమలు చేశాడని చెప్పారు.ఈకార్యక్ర మం మండల ఉపాధ్యాక్షులు బాబు, ప్రత్యేక అదికారి డాక్టరురామోహన్‌రావు, తహశీలుదారు మల్లికార్జునరావు, యంపిడిఓ విజయకుమారరెడ్డి,జెడ్‌పిటిసి సభ్యులు మల్లిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి యంపిటిసిలు సర్పంచులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సంధర్శించిన ట్రైనీ కలెక్టర్

రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

నందికొట్కూరు,ఆగష్టు 30,ప్రభాతవార్త: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయాన్ని ట్రైనీ కలెక్టర్ భం త్‌నాయక్ మంగళవారం సంధర్శించారు. శిక్షణలో భాగంగా ఆయన రెవెన్యూ రికార్డులైన అడంగల్, ఆర్.ఎస్.ఆర్. ఆర్.ఓ.ఆర్.1బి, సిసిఆర్‌సి రికార్డులను పరిశీలించారు. అలాగే ధ్రువీకరణ పత్రాల జారీ గురించి వివరాలను అడిగి పరిశీలించారు. వి.ఆర్.ఓ.నరసరాజు పాల్గొన్నారు.

మహిళ కోసం ఎస్.ఆర్.బి.సి.కాలువలో గాలింపు

మిడుతూరు,ఆగష్టు 30,ప్రభాతవార్త: మండలంలోని తలముడిపి గ్రామ సమీపంలోని ఎస్.ఆర్.బి.సి. కాలువలో మహిళ ఆచూకి కోసం ఎస్సై మారుతిశంకర్ తన సిబ్బందితో బోటులో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 10వ తేదీన గువ్వల ఎల్లావతి అనే మహిళ మిడుతూరుకు తన భంధువుల ఇంటికి వచ్చింది. కాగా ఆమె మరుసటి రోజు నుండి కనిపించ డంలేదని ఆమె కొడుకు శ్రీకాంత్ స్తానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే అనుమానాస్పదంగా మృతి చెందిన ట్లు పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో వచ్చిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో ఎస్.ఆర్. బి.సి.కాలువలో బోటులో గాలింపు చర్యలు చేపట్టారు. ఇంత వరకు ఆమె ఆచూకి లభ్యం కానట్లుగా తెలిసింది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డి.యం.హెచ్.ఓ.

వెలుగోడు,ఆగష్టు 30,ప్రభాతవార్త: మండల పరిధిలోని వేల్ప నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్. వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో జరుగు తున్న ప్రసావలు విషయంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై డా.కిర ణ్‌కుమార్‌తో చర్చించారు.సేయసోనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తప్పకుండా బయోమెట్రిక్ హాజర్ వేసి విధులను నిర్వహించాలని ఆదేశించారు. అలాగే అదన ంగా ఉన్న సిబ్బందిని వేరే సి.హెచ్.సి.లకు కేటాయిస్తామని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రి పాత ధభవనం గదులను పరిశీలిస్తూ కొత్త భవన నిర్మాణం పనులను వేగవంతంగా చే యాలని తెలిపారు. అనంతరం రేగడగూడూరు సబ్‌సెంట ర్‌ను సంధర్శించి యం.యల్.హెచ్.పి.విధి నిర్వహాణను పరిశీలించి అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి తక్కువగా ఉన్న మందులను తెప్పించుకోవాలని సూచించారు.

ఆస్పత్రిని పరిశీలిస్తున్న డి.యం.హెచ్.ఓ

ప్రతి పక్షం లేని లోటు తీర్చిన అధికార పక్షం

- సమావేశాన్ని బహిష్కారించిన కౌన్సిలర్

నందికొట్కూరు,ఆగష్టు 30,ప్రభాతవార్త: ఏదైన మండల సమావేశం కాని పురపాలక సంఘ సమావేశంలో కాని అధికార పక్షాన్ని ప్రతి పక్షం ఇరకాటంలో పెట్టడం, సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేయడం సర్వసాధారణం. కాని నందికొట్కూరు పురపాలక సంఘం సాధారణ సమావేశంలో అధికార పక్షమే ప్రతి పక్షపాత్ర కూడ పోషించింది. మంగళవారం స్తానిక జైకిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన పురపాలక సంఘం సమావేశం జరిగింది. తన వార్డులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి తనని పిలువలేదని, ప్రోటోకాల్ పాటించలేదని, అలాగే అభివృద్ధి పనుల ప్రారంభానికి పిలిచిన అధికారులు రాలేదని నిరసనగా సమావేశం బహిస్కరిస్తున్నట్లుగా 12వ వార్డు కౌన్సిలర్ లాలుప్రసాద్ వెళ్ళిపోయారు. 24వ వార్డులో పైపులైన్ కోసం గుంతలు తీసి పూడ్చలేదని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పంధించడంలేదని 24వ వార్డు కౌన్సిలర్ చాంద్‌బాష ఆరోపించారు. పట్టణంలో మిదుతూరు రోడ్డులో ఉన్న సర్వే నెంబర్‌లో అనుమతి లేకున్న రోడ్లు వేస్తున్నారని 18వ వార్డు కౌన్సిలర్ ధర్మారెడ్డి ఆరోపించారు. దీంతో కో-ఆపసన్ మెంబర్ శ్రీనువాసురెడ్డి, కౌన్సిలర్ అబ్దుల్ రహూఫ్ అడ్డు తగిలి అందరి భాగోతం మాకు తెలుసునని త్వరలో బైటపెడుతామని వారు తెలిపారు. మున్సిపల్ అధికారులు జగనన్న విద్యా దీవెన కార్యక్రమానికి కౌన్సిలర్లను పిలువలేదని కౌన్సిలర్ అబ్దుల్‌రవూఫ్ అన్నారు. మారుతినగర్,బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కాలనీలలో ఏళ్ళ తరబడి విధ్యుత్ చార్జీలు చెల్లిస్తు నివాసం ఉంటున్నారని వారికి పట్టాల విషయంలో చర్యలు తీసుకోవాలని చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తహాసిల్దార్ రాజశేఖర్‌బాబుకు సూచించగా ఆయన స్పంధిస్తు విధ్యుత్ అధికారులు స్థలం ఎవరిది అని పట్టాలు చూడకుండా ఏ మాత్రం ఆలోచించకుండ వారికి మీటర్లు, ఇవ్వడం అలాగే మున్సిపల్ అధికారులు ఇళ్ళ నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో మా పనులు మేము చేయలేక పోతున్నామని దీనిపై సమీక్ష సమావేశం అవసరమని తహాసిల్దార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం విధ్యుత్ బకాయి ఈ ఏడాది ఏప్రిల్ నుండి ఆగష్టు వరకు రూ.1.32 కోట్లు బకాయి ఉన్నట్లుగా తెలిపారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు తీర్మానం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ, కమీషనర్ శ్రీమతి బేబి, డి.ఇ.నాయబ్‌రసూల్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

ఉల్లి మద్దతుధర కోసం ప్రభుత్వంతో చర్చిస్తా : ఎంఎల్ఏ

- రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది

- ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి

సూగూరు(మంత్రాలయం),ఆగస్టు 30,ప్రభాతవార్త: ప్రసు తుత ఉల్లిపంట సాగుచేసిన రైతులు మద్దతుధర లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, ఉల్లిరై తులకు మద్దతుధర కోసం ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చించి రైతుల కష్టాలు తీర్చడానికి తనవంతుగా ప్రయ త్నిస్తానని ఎంఎల్ఏ,వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షులు వై.బా లనాగిరెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని సూగూరు గ్రామంలో డ్రిప్ ఇరిగేషన్(బిందు, తుంపర సేద్యం)లో భాగంగా పరికరాల కోసం ప్రభుత్వానికి ధరఖాస్తు చేసుకున్న రైతులకు డ్రిప్ పరికరాలను పంపిణీ చేశారు.ఏపిఎంఐపి ఆధ్వర్యంలో ఈ పరికరాలు మంజూర య్యాయి.ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మన భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశమని కాబట్టి దేశంలో రైతు బాగుంటే దేశంమొత్తం బాగుంటుందని పేర్కొన్నారు.ఐదు ఎకరముల లోపు రైతులకు 90 శాతం రాయితీపై అదేవిధంగా ఐదు ఎకరముల పైన ఉన్న రైతులకు 70 శాతం రాయితీపై ఈ పరికరాలు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.సూగూరు గ్రామంలో సుమారు 20 మంది రైతులకు 19.16 ఎకరములకు గాను రూ.26.94 లక్షల విలువగల డ్రిప్ పరికరాలు పంపిణీ చేశామన్నారు.అనంతరం ఎంఎల్ఏను స్థానిక నాయకు లు,కార్యకర్తలు,అభిమానులు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి,పిడి ఉమాదేవి,ఏపిడి రాజకృష్ణారెడ్డి,మండల వ్యవసాయా ధికారి గణేష్,ఉద్యానశాఖ అధికారిణి అపర్ణ,ఉప సర్పంచ్ గోపినాథ్,నాయకులు లక్ష్మయ్య,ఫినోలెక్స్ కంపెనీ డిసిఓ మోహన్‌బాబు,డీలర్ రాఘవరెడ్డి,రఘురామరెడ్డి,దేవదా సు,లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఏ

అమ్మమ్మ బాగున్నారా... పెన్షన్ వస్తుందా...

అమ్మమ్మ కుశలమేనా అంటూ పలకరిస్తున్న ఎమ్మెల్యే

నంద్యాల క్రైం, ఆగష్టు 30, ప్రభాతవార్తః అమ్మమ్మ బాగున్నారా అమ్మ పెన్షన్ వస్తుందా పెన్షన్ రాకపోతే చెప్పండి అంటూ పలకరించి గడప గడపకు కార్యక్రమంలో కుశల ప్రశ్నలతో కార్యక్రమాన్ని సాగిస్తున్నారు. ఎమ్మెల్యే పలకరింపుకు అవ్వతాత అమ్మలు మురిసిపోయారు. వారి ముఖాల్లో ఆనందం ఉప్పొంగిపోయింది. కళ్ళల్లో ఆనందబాష్పాలు తమ బిడ్డ, తమ మనువడు వచ్చి పలకరిస్తున్నట్లుందని ఓ మహిళ ఎమ్మెలే్యతో ఇలా సంబాషణ సాగింది. రాష్ట్ర ప్రభుత వ్ం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు కార్యక్రమానికి అశేష స్పందన లభిస్తుంది. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అదేశాల మేరకు జిల్లాలోని అయా నియోజకవర్గం ఎమ్మెల్యేలు స్థానికంగా ఉంటూ గడప గడప కార్యక్రమంలో పాల్గొంటున్న విషయం విధితమే. ప్రతిఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించడంతో పాటు సక్రమంగా అందాయా లేదా అడిగి తెలుసుకుంటున్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కానివి అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని చూపించారు. ఈక్రమంలో ఓ అవ్వచూసి అవ్వతో కొద్దిసేపు కుశల సంభాషణ సాగించారు. మురిసిపోయిన ఆ అవ్వ ఎంతో సంతోషపడింది. ఎమ్మెల్యే ఎంతో బిజిగా ఉన్న తమ యోగక్షేమాలు తెలుసుకోవడం ఎంతో సంతోషానిచ్చింది. ఎమ్మెల్యే పలకరింపుతో ఉబ్బితబైపోయింది. మీ అమ్మకడుపు చల్లగా పిల్లపాపలతో పదికాలాలపాటు క్షేమంగా ఉండాలని దీవించింది. ఇలా అడగడుగునా ఎమె ్మల్యేకు ఘనస్వాగతం లభిస్తుంది.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం ; ఎమ్మెల్యే

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిలీగల్, ఆగస్టు 30, ప్రభాతవార్త ; ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసా ద్‌రెడ్డి పేర్కొన్నా రు. ఈ మేరకు మంగళవా రం పట్ట ణంలోని ఆర్‌అండ్ బి గెస్ట్ హౌస్ ఏరియాలో ఎమ్మెల్యే 'గడపగడపకు మన ప్రభు త్వం' కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడపగడప కు తిరుగుతూ ప్రజలకు నవరత్నాలతో పాటు వార్డు ప్రజలు వార్డులో రోడ్లు వేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయిన వెంటనే 95 శాతం పనులు చేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచాడన్నారు. ప్రతి వ్యాపారవేత్తకు ప్రతి నిరుపేదలకు అండగా నిలబడి నేనున్నాని భరోసా ఇస్తూ రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తెచ్చారన్నారు. గత టీడీపీ కేవలం వాళ్ల పార్టీ అనుచరులకు సంక్షేమ పథకాలు అందించి రాష్ట్ర ఖజానాకు గండి కొట్టారన్నారు. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి లోటుపాట్లు ఉన్నా వంద శాతం సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కరోనా కష్ట కాలంలో టీడీపీ అధినేత ప్రజల వైపు కూడా చూడలేదన్నారు. ప్రజలకు దూరంగా ఉంటూ ప్రభు త్వంపై విమర్శలు చేశారన్నారు. ప్రజలు వైఎస్సార్సీపీ ప్రభుత్వ తీరు పట్ల సంతృప్తిగా ఉన్నారని, వచ్చే 2024 ఎన్నికల్లో కూడా వైఎస్సార్సీపీనే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు బి.దేవా, చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డా.మధుసూ దన్, నల్లారెడ్డిగారి నల్లారెడ్డి, జేలేకా, శ్రీలక్ష్మి, వార్డు కౌన్సిలర్ చిన్నచలపతి, లాల్‌బాషా, కామాక్షి తిమ్మప్ప, కె.తాయన్న, లక్ష్మన్న, మురళీరెడ్డి, పూర్ణ, యమన్, నాగేంద్ర, ఏఈ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యాగంటిపల్లె గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం - ఎమ్మెల్యే రామిరెడ్డి

కరపత్రాలను ప్రజలకు అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్,ఆగస్టు30,ప్రభాతవార్త: మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిర్వహించారు.వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి,ఆయన సతీమణి,గ్రామ సర్పంచ్ బండి వరలక్ష్మిరెడ్డిల ఆధ్వర్యంలో ఎంపిటిసి లక్ష్మిదేవి,వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఘనస్వాగతం పలికారు.మహిళలు హారతులు పట్టి సాదరంగా ఆహ్వానించారు.ఇంటింటికి వెళ్లి జగనన్న మూడు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయంటూ ప్రజల నుంచి స్వయంగా తెలుసుకోఉవడమే కాకుండా ప్రజల సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రరెడ్డి,బండి మన్మథరెడ్డి,యామ సుధాక ర్‌రెడ్డి,బండి భాస్కర్‌రెడ్డి,సర్వేపల్లి శివారెడ్డి,చంద్రకళాధర్‌రెడ్డి,కృష్ణమోహన్‌రెడ్డి, రామకృష్ణౌ ండ్డి,యమ్మనూరు బ్రహ్మానందరెడ్డి,నాగేశ్వరరెడ్డి,విజయభాస్కరరెడ్డి, ఎస్.రవీం దనాథ్‌రెడ్డి,శివరామిరెడ్డి,బత్తుల శంకర్‌రెడ్డి,సర్వేపల్లె మహేశ్వరరెడ్డి,సర్వేపల్లె రామేశ్వరరెడ్డి, భానుముక్కల శివశంకర్‌రెడ్డి,బండి రామచంద్రారెడ్డి,సోమన్నగారి రవిశంకర్‌రెడ్డి,శివప్రసా దరెడ్డి,దండు నరసింహ,బోయ వెంకటరమణ,నాగేశ్వరరావు,రామనాథరెడ్డి,బత్తుల పరమేశ్వరరెడ్డి,కొట్టం రామమద్దిలేటి,బండి శివారెడ్డి,ఎంపిడివో ఏ.శివరామయ్య,ఆర్‌డబ్ల్యుఎస్ సాయికృష్ణ,పంచాయతీరాజ్ ఏఈ రమణ,ఆర్ఐ రాఘవేంద్రరావు,గ్రామ సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వేముగోడులో డెంగ్యూ వ్యాధి నిర్ధారణ

- నివారణ చర్యలు చేపట్టిన వైద్యశాఖ

గోనెగండ్ల ఆగస్టు 30 ప్రభాతవార్త : గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో శ్యామల అనే మహిళకు డెంగ్యూ వ్యాధి నిర్ధరణ అయినట్లు అసిస్టెంట్ మలేరియా ఆఫిసర్ చంద్రశేఖర్ తెలిపారు.దీంతో మండలంలోని వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది నివారణ చర్యలు చేపట్టింది.అందులో భాగంగా శ్యామల ఇంటి పరిసరాలలో పెరిత్రియం ద్రావణంను పిచికారి చేసి ఈగలు,దోమలు పెరగకుండా ఉండేందుకు గాను నీటి గుంతలు మురుగునీరు నిలువ లేకుండా చర్యలు తీసుకున్నారు.అలాగే అబాబ్ ద్రావణంతో పిచికారి చేశారు.రోగి ఇంట్లో పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారు.రోగి ఇంట్లో నిలువ ఉన్న నీటిని చల్లి వేశారు.నీరు నిలువ ఉంటే అందులో దోమలు,ఈగలు గుడ్లు పెడతాయిని అందచేత ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు.రోగి బందువులకు తెలిపారు.అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు కోరారు.జ్వరం,ఇతరత్ర అనారోగ్యలక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యశాఖ అదికారులు కోరారు.ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయిబాబ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ హనుమంతు,పరమేష్,వెంకటలక్ష్మి,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గరం గరం

నంద్యాల, ఆగష్టు 30, ప్రభాతవార్తః నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్మన్ మాబున్నిసా అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. సమావేశం రసాభసాగా గరం గరంగా సాగింది. 12వ వార్డు కౌన్సిలర్ స్వతంత్ర్య అభ్యర్థి శ్యాంసుదర్‌లాల్ తనవార్డులో జరుగుతున్న అవినీతిపై బహిరంగంగా అందోళన వ్యక్తం చేశారు. తనవార్డులో అక్రమంగా కట్టడాలు నిర్మిసు ్తన్నారని ఆరోపణలు వస్తే అధికారులు పోయి తూతుమంత్రంగా మెట్లుపడగొటి్ట రావడంకు గల కారణాలు ఏంటి ఏవరు సంతృప్తిచెందితే అధికారులు అక్రమకట్టడాలు డేమాలిస్ చేయకుండా కేవలం తూతుమంత్రంగా చర్యలు తీసుకోవడం ఏవరు సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులా? రాజకీయ నాయకులా దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్కుజోన్‌లో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నా వాటికి అనుమతులు ఏవరిచ్చారు. సభకు సమాధానం ఇవ్వాలని పట్టుబట్టారు. గత కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి పాల్గొన్న సమావేశంలో మావార్డుకు నిధులు కేటాయించాలని అడిగానని అందుకు వార్డు అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేసిందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని 42 వార్డుల్లో వార్డు వాలంటీర్లు పనితీరు అధ్వానంగా ఉందని కౌన్సిలరు అందోళన వ్యక్తం చేశారు. వృద్యాప య పెన్షన్లు ఇంటింటికి పోయి పంచాల్సిన సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు కార్యాలయాలకు పిలిపించుకోని ఇవ్వడం సరైన పద్ధతి కాదని కౌన్సిలర్ అందోళన వ్యక్తం చేశారు. వీధి దీపాలు వెలగడం లేదని రోడ్ల మరమ్మత్తుల పనులు చేపట్టాలని కౌన్సిలర్లు పేర్కొన్నారు. నంద్యాల పట్టణం ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి అధ్వర్యంలో వార్డుల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వైసీపీ కౌన్సిలర్లు సభకు వివరించారు. 12వ వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్ మాట్లాడుతూ గత కౌన్సిల్ ప్రారంభమై 15 నెలల గడిచిందని సాక్షాత్తు చైర్మన్ రెండు నెలల క్రితం అభివృద్ధి పనులకు శంఖస్థాపన చేస్తే నేటికి ఆ పని ప్రారంభించకపోవడం విశేషం అన్నారు. కాంట్రాక్టర్ పనితీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అందరం కలిసి పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుందామని కౌన్సిలర్లు కోరారు. టిడిపి కౌన్సిలర్ మాబు తనవార్డులో జరగాల్సిన అభివృద్ధిని అవేధనతో జరగడం లేదని పేర్కొన్నారు. కార్యమ్రంలో వివిధ శాఖల అధికారులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఐఐఐటి నోటిఫికేషన్ విడుదల

- దరఖాస్తులకు సెప్టెంబర్ 19 అఖరుతేది

నంద్యాల విద్య, ఆగష్టు 30, ప్రభాతవార్తః విద్యార్థులు ఎంతకాలంగానో ఎదురు చుస్తున్న ఐఐఐటి నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేస్తు యూనివర్షిటి అధికా రులు ఉత్తర్వులు జారీచేశారు. రాజీవ్‌గాంధీ యూనివర్షిటి అఫ్ నాలేడ్జి టెక్నాలజీస్ ఆర్‌కె వ్యాలి, న్యూజివీడు, శ్రీకాళం, ఒంగోలు, ఇడుపులపాయ క్యాంపసుల్లో ప్రవేశాల కోసం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 19వరకు అన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. అక్టోబర్ 12, 13,14,15 తేదిల్లో అయా క్యాంపస్‌ల్లో ఒరిజినల్ సర్టిఫికేషన్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. అక్టోబర్ 17 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. అభ్యర్థులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈహెల్ప్‌లైన్ నంబర్ ద్వారా 9703542597, 9705472597 వివరాలను తెలుసుకోవచ్చని అయా ప్రకటనలో పేర్కొన్నారు.

ఓ మహిళ పట్ల అసభ్య ప్రవర్థనపై కానిస్టేబుల్ సస్పెన్షన్

మాట్లాడుతున్న డిఎస్పీ శ్రీనివాస్

దేవనకొండ,ఆగస్టు 30,ప్రభాతవార్త : మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కానిస్టేబుల్ చంద్రబాబుకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పత్తికొండ డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మహిళ పట్ల అసభ్య ప్రవర్తన,అవినీతి ఆరోపణలు చేసినట్లు విచారణలో తేలిందని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆ పోలీస్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులు వచ్చినట్లు వెల్లడించారు. విధుల్లో అలసత్వం,అవినీతి ఆరోపణలు వచ్చిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పత్తికొండ సిఐ రామకృష్ణారెడ్డి,స్థానిక ఎస్ఐ ఏపి శ్రీనివాసులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు

నంద్యాల క్రైం, ఆగష్టు 30, ప్రభాతవార్తః టెలికాం నగర్‌లో జరిగిన దొంగతనంలో ఇరువురు నేరస్థులను అరెస్టుచేశామని సి మురళీమోహనన రావు తెలిపారు. మంగళవారం తాలూక పోలీస్‌స్టేషన్‌లో విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. 2022 సంవత ్సరంలో రాత్రి ఓ ఇంటికి తాళం వేసిన ఇంట్లో జొరబడి సుమారు రూ.9 లక్షల విలువల 19 తులా ల అభరణాలు, రెండుబిస్కెట్ల దొంగతనం జరిగిందని తెలిపారు. అప్పట్లో తాలూక పోలీస్‌స్టేషన్‌లో బాధితుని పిర్యాదుమేరకు కేసును వేగవంతం చేశారు. దొంగతనం కేసులో దొరికిన వేలిముద్ర, అధార్ ద్వారా టెక్నాలజీ ఉపయోగించుకొని కేసును చేధించినట్లు తెలిపారు.నిందితుల వద్ద ఆరోజు జరిగిన దొంగతనం నుంచి బంగారు నగలును,న బిస్కెట్లను స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. నిందితులు కోవెలకుంట్ల క్రాస్‌రోడ్డు పంచల్ శివ, కర్నాటక రాష్ట్రానికి చెందిన బాలున్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చిన్నఅధారంతో పట్టుకోవడంలో ప్రతిభను చూపించిన పిసిలు విశ్వనాధ్, మధుసూధన్‌రెడ్డి, సత్తార్‌లను అధికారులు అభినందించారు.

గాజులపల్లె స్టేషన్‌ను మహానంది రైల్వేస్టేషన్‌గా పేరుమార్చండి

**– వైజాగ్ నుంచి కడప వరకు నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను నంద్యాల వరకు పొడిగించాలి –